క్లుప్తంగా

సింహగిరికి యజ్ఞ వైభవం

- మూడో రోజు సుదర్శన నృసింహ మహాయజ్ఞం
- విశేషంగా పూర్ణాహుతి
- పెద్ద ఎత్తున పాల్గొన్న ఉభయదాతలు



యజ్ఞాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

సింహాచలం: సింహగిరిపై సుదర్శన నారసింహ మహాయజ్ఞం మూడో రోజు శుక్రవారం వైభవంగా కొనసాగింది. ఎటుచూసినా యజ్ఞ ఘోషతో సింహగిరి మార్మోగింది. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకిలోను, చక్రపెరుమాళ్‌ను ఒక పల్లకిలోను వేంజేంపచేసి ఆలయ ఉత్తరరాజ గోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ను ఒక వేదికపైన, మరొక వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేంపచేశారు. వేద మంత్రోశ్చరణల మధ్య యజ్ఞాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో పూర్ణాహుతి నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రభంద పారాయణం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకం పారాయణాలను వైదికులు పఠించారు. ఉభయదాతలకు దేవస్థానం తరపున శాలువ, రవిక, కల్యాణం లడ్డు, పులిహోర ప్రసాదం, అప్పన్నసామి రాగి ప్రతిమ అందజేశారు. యజ్ఞం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

వెంకన్నకు క్షీరాభిషేకం



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం క్షీరాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్రమత్తంగా ఉండండి

ఎస్పీ మురళీకృష్ణ



చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

పరవాడ: అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. డబ్బు, మద్యం, నాటుసారా, గంజాయి, ఉచిత కానుకలు వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర పోలీసు దళాలు, పోలీసులను ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. ఎస్పీ వెంట సీఐ బాలసూర్యారావు ఉన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. స్వామికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



సబ్బవరంలో సేవలందిస్తున్న గ్రామ సచివాలయం



ఆదిరెడ్డిపాలెం సచివాలయంలో విధుల్లో సిబ్బంది



గొటివాడలో అందుబాటులోకి వచ్చిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

ప్రగతి పథాన పల్లెలు

- సచివాలయ వ్యవస్థతో అభివృద్ధి విప్లవం

సబ్బవరం: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో సాకారమవుతోంది. స్థానిక స్వపరిపాలన నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి.

మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన భవనాల వివరాలు

సచివాలయం	నిర్మించిన భవనాలు
అమృతపురం	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం,వైఎస్సార్ విలేజ్ క్లినిక్
అంతకాపల్లి	గ్రామసచివాలయం,రైతు భరోసా కేంద్రం,వైఎస్సార్ విలేజ్ క్లినిక్
ఆరిపాక	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం,వైఎస్సార్ విలేజ్ క్లినిక్
అసకపల్లి	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం
బంగారమ్మపాలెం	గ్రామ సచివాలయం
బోదువలస	గ్రామ సచివాలయం
గొటివాడ	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం,వైఎస్సార్ విలేజ్ క్లినిక్
గొల్లలపాలెం	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం,వైఎస్సార్ విలేజ్ క్లినిక్
గుల్లేపల్లి	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం
మల్లునాయుడుపాలెం	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం.
మొగలిపురం	వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్
నారపాడు	గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం
పైడివాడ అగ్రహారం	రైతు భరోసా కేంద్రం
సబ్బవరం-1	గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం
సబ్బవరం-2	ఆదిరెడ్డిపాలెంలో గ్రామ సచివాలయం
సబ్బవరం-3	పెదనాయుడుపాలెంలో గ్రామ సచివాలయం
తవ్వవానిపాలెం	గ్రామ సచివాలయం,వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్
వంగలి	గ్రామ సచివాలయం,వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



అమృతపురంలో రైతు భరోసా కేంద్రం

పల్లెలే పట్టుకొమ్మలన్న గాంధీజీ మాటలను నిజం చేసేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాలను సమగ్రాభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. తద్వారా పల్లెలన్నీ ప్రగతి పథాన దూసుకుపోతున్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలను పారదర్శకంగా అందిస్తోంది. మండల కేంద్రాల పరిధిలో గ్రామ సచివాలయంతోపాటు పలు ప్రభుత్వ భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సచివాలయ స్థాయిలో ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోంది. సచివాలయ వ్యవస్థతో అభివృద్ధిలో విప్లవాత్మక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది.

ప్రజల సేవలో..

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 20 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే వాటి పరిధిలో రూ.8.35 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వంటి 35 ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ప్రారంభోత్సవాలు చేసి ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న మరో 16 ప్రభుత్వ భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి.

- మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 143 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు 363 మంది గ్రామ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధాన కర్తలుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు పారదర్శకంగా అర్హులను గుర్తిస్తూ ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందిస్తున్నారు. వీటితోపాటు ప్రభుత్వం చేపట్టే అనేక అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

సకల సేవలు గ్రామంలోనే..



మా గ్రామంలోనే గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం,వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి.అన్ని రకాల ప్రభుత్వ సేవలు,పథకాలను గ్రామ స్థాయిలోనే పొందుతున్నాం.గతంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ మండల కేంద్రాల్లో ఉండేవి. ప్రజలు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకే చేరుతున్నాయి.

–లగిశెట్టి కుమార్,గొటివాడ ,సబ్బవరం మండలం.

అన్నదాతకు దన్నుగా..



గ్రామ సచివాలయం అందుబాటులోకి రావడంతో అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడంతో ఏ పని కావాలన్నా సులభంగా అవుతుంది.మా రైతులకు అవసరయ్యే విత్తనాలు,ఎరువులు గ్రామంలో ఉండే రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై అందిస్తున్నారు.రైతులకు అవరమయ్యే అన్ని రకాల సేవలు గ్రామ స్థాయిలో ఉండే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడంతో రైతుల కష్టాలు తీరాయి.

–జెట్టి కొండమ్మ,వంగలి, సబ్బవరం మండలం

వైద్య సేవలు బాగున్నాయి



ప్రభుత్వ సేవలు మా అందరికీ చేరువయ్యాయి.వయసు మీరడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.గతంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నా,మందులు కావాల్సి వచ్చినా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఆర్థిక పరిస్థితి బాగులేక ఇబ్బందులు పడేవారం. గ్రామంలోకి 104 వాహనం వచ్చినప్పుడు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు.విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు.

–కండిపల్లి దేవుడమ్మ,రాయపుర అగ్రహారం,సబ్బవరం

రేపు 'మన పోలింగ్ బూత్ - మన ఓటు'

పెందుర్తి: జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, జన సాంద్రత ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో 'మన పోలింగ్ బూత్–మన ఓటు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పెందుర్తి రిటరింగ్ అధికారి పి.శేష శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వో), సూపర్‌వైజర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు నమోదు అయిన సంఖ్య, పోలింగ్ కేంద్రం చిరునామా తెలియజేస్తారన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక పోలింగ్‌లో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటింగ్ శాతం పెంపుదలకు కృషి చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



గుడ్ ఫ్రైడే సందేశం అందిస్తున్న థామస్ పులికల్

సబ్బవరం: మండలంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.సబ్బవరంలోని కేథలిక్ చర్చి, ఫాతిమా మాత చర్చి, ప్రీస్ట్ థామస్ పులికల్,దేవీపురం డాన్ బాస్కో ఫాదర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పవిత్ర ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి క్రైస్తవులు ఉపవాస ప్రార్థనల్లో గడిపి ఏసు ప్రభువును సిలువ వేసి హింస పెట్టిన ఆనాటి సన్నివేశాలను వివరించారు. బ్రిజిటన్ సిస్టర్స్ అలీన,పునీత,విజయ ప్రియ,ఫ్లోర, ప్యారిస్ కౌన్సిల్ సభ్యుడు ఆడారి నాగరాజు,పాలవెల్లి,శరగడం గణేష్,బొబ్బిలి అప్పారావు,ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'మహానేత' వెబ్ చానల్ ప్రారంభం



మహానేత వెబ్ చానల్ ప్రారంభిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

పెందుర్తి: పురుషోత్తపురానికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు, పెనుమత్స ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'మహానేత' వెబ్ చానల్‌ను రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. నగరంలోని ఎంపీ నివాసంలో శుక్రవారం 'మహానేత' వెబ్ చానల్ లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో చానల్ నిర్వాహకురాలు ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసరాజు, సతీష్‌వర్మ, ఫరూఖీ, మోషేరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



భర్త ఈత భాస్కరరావు, పిల్లలతో వలంటీర్ లక్ష్మి(ఫైల్)

పరవాడ: కారు ప్రమాదంలో మరణించిన ఈ.బోనంగి గ్రామానికి చెందిన ఈత భాస్కరరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం అందజేశారు. వైఎస్సార్ బీమా పథకంలో ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని మృతుడి భార్య గ్రామ వలంటీర్ ఈత లక్ష్మి(నవీనా) శుక్రవారం తెలిపింది. తన భర్త భాస్కరరావు జనవరిలో రాజమహేంద్రవరం నుంచి కారులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని చెప్పింది. తనకు ఇద్దరు కుమారులు, అత్త ఉన్నారని, వలంటీర్‌గా పనిచేస్తూ ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నట్లు వెల్లడించింది. గ్రామంలో గృహసారథిగా పనిచేస్తున్న తన భర్త భాస్కరరావు కారు ప్రమాదంలో మరణించగా.. వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసి నేరుగా తన బ్యాంక్ అకౌంట్‌లో జమచేసిందని లక్ష్మి చెప్పింది. బీమా పరిహారం అందించి తన కుటుంబానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. బీమా సౌకర్యం కల్పించడానికి దోహదపడిన రాష్ట్ర జేసీఎస్ కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

13 మంది జూదరుల అరెస్ట్

వారి నుంచి రూ.37,130 స్వాధీనం

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల శివార్లలో గుళ్లాట,పేకాట,ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న స్థావరాలపై దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.37,130 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వివరాలు.. మల్లునాయుడుపాలెం శివారులలో లూడో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నట్టు సమాచారం అందడంతో గురువారం రాత్రి దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.13,130 నగదు స్వాధీనం చేసుకున్నారు.అలాగే అమృతపురం శివార్లలో శుక్రవారం గుళ్లాట ఆడుతున్న 4గురిని అదుపులోకి తీసుకుని వారి రూ.14 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎ.శిరసపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్టు శుక్రవారం వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి 6గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అరెస్టు చేసిన 13 మందిని అనకాపల్లి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి

పరవశించిన భక్తజనం



సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి సూర్యప్రభ వాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



అడవివరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అడవివరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరుతున్నారు. అడవివరంలోని భూలోకనగర్, లక్ష్మీనరసింహనగర్, సింహాద్రినగర్, జెడ్పీ హైస్కూల్ ఏరియాల్లో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిని, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, వార్డు వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, నాయకులు కర్రి స్వామి, లంక సత్తిబాబు, బొట్టా శ్రీను, లండ భాస్కర్, లండ రమేష్, కొనపల సత్యనారాయణ మాస్టారు, మునపర్తి శివ, దమ్ము ఎర్రాజీరావు, బోర కృష్ణారెడ్డి, లండ వెంకటరమణ, అశోక్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన మహిళ

పద్మనాభం : మండలంలోని విలాస్కాన్‌పాలెంలో ఇటుక బట్టీల్లో ఒక మహిళ అదృశ్యమైనట్టు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామంలోని మణికంఠస్వామి ఇటుక బట్టీలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక కుటుంబం పని చేస్తోంది. ఈ కుటుంబంలోని ముఖ్ల పరిద (24) మానసిక పరిస్థితి బాగులేనందున ఈ నెల 28న ఇటుక బట్టీనుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెదికినా కనిపించక పోవడంతో పరిద తండ్రి ముఖ్ల సిరిజిల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కాలనీలో చోరీ

ఏడు తులాల బంగారం అపహరణ



చోరీ జరిగిన ఆచార్యులు ఇల్లు

సింహాచలం: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి ఏడు తులాల బంగారం, 150 గ్రాముల వెండి దొంగిలించారు. వివరాలు.. జీవీఎంసీ 98వవార్డు అప్పన్నపాలెం నుంచి భరత్‌నగర్‌కి వెళ్లే మార్గంలో ఉన్న పంచాయతీ కాలనీలో రిటైర్డ్ ఎంఈఎస్ ఉద్యోగి వీవీఎస్ ఆచార్యులు భార్య కామేశ్వరితో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 21న ఇంటికి తాళం వేసి కాశీ వెళ్లారు. తిరిగి ఈనెల 28న సాయంత్రం విశాఖ వచ్చి గాజువాకలో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లారు. ఇదిలావుండగా గురువారం రాత్రి ఇంటి గోడ దూకి తలుపుగ్రిల్, తాళం విరగ్గొట్టి లోపలకు దొంగలు ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోని బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారం, 150 గ్రాముల వెండి దొంగిలించుకుపోయారు. కాగా ఇంటి రెండోవైపు తలుపు తెరిచి ఉండడంతో పక్కింటిమేడపై ఉన్నవారు చూసి గాజువాకలో ఉన్న ఆచార్యులుకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన ఆచార్యులు దొంగతనం జరిగిందని పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం డీసీపీ రత్నం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్రైం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ డి.సూర్యనారాయణ స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారికి సత్కారం



స్టీల్‌ప్లాంట్ అధికారి సూరి అప్పారావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ పాలిశెట్టి సూరి అప్పారావు శుక్రవారం సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా హెచ్‌ఆర్ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో సత్కార సభ ఏర్పాటు చేశారు. హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు, డీజీఎంలు ఎస్.కె.ఖర్, వి.అరుణలు సూరి అప్పారావు దంపతులకు శాలువా కప్పి పూలమాలలతో అభినందించారు. వారికి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ బి.జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

15.5 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: గంజాయి తరలిస్తున్న ఒడిశా వాసిని విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనంత్‌రావు సిబ్బందితో కలిసి స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన సాహిల్ సింగ్ బ్యాగులను తనిఖీ చేయగా.. అందులో 15.5 కిలోల గంజాయి గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని.. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.